అడుగడుగునా నిర్లక్ష్యం..!

- స్వప్నలోక్ ఘటనపై స్థానికుల్లో కలకలం
- నిర్వహణ లోపమే ప్రమాదానికి కారణమని విమర్శలు

రాంగోపాల్‌పేట్: స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో గురువారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం కలకలం రేపింది. నిత్యం పెద్ద ఎత్తున వినియోగదారులు, షాపుల్లో పనిచేసే సిబ్బందితో రద్దీగా ఉండే ఈ కాంప్లెక్స్‌లో అగ్ని ప్రమాదం జరిగి ఆరుగురు ప్రాణాలు కోల్పోవడంతో స్థానికంగా విషాదచాయలు అలుముకున్నాయి. కాంప్లెక్స్‌లో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది శుక్రవారం ఉదయమే ఇక్కడకు చేరుకుని ఏమి జరిగిందని ఆరాతీస్తూ కనిపించారు. సా.6.30 గంటల తర్వాత ఇక్కడ ప్రమాదం జరగడంతో చాలా కార్యాలయాలు అప్పటికే మూసివేయడంతో సిబ్బంది ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. శుక్రవారం ఉదయం ఘటన గురించి తెలుసుకుని వారంతా ఇక్కడికి చేరుకుని దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు.

- నలభై ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనాన్ని బిల్డర్ ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో సుమారు 400 షాపులు, కార్యాలయాలు ఉన్న ఈ కాంప్లెక్స్ మెయింటెనెన్స్ గాలిలో దీపంలా మారింది.
- కాంప్లెక్స్ మొత్తాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఉదయం షాపులు, కార్యాలయాలకు వచ్చిన వారిని పోలీసులు లోపలికి అనుమతించలేదు. క్లూస్ టీం, ఫైర్ సిబ్బంది భవనంలో అడుగడుగునా తనిఖీలు చేశారు.
- సుమారు ఎకరం స్థలంలో స్వప్నలోక్ కాంప్లెక్స్‌ను సుమారు 40 ఏళ్ల క్రితం మహవీర్ అగర్వాల్ అనే వ్యక్తి నిర్మించాడు. చాలా వరకు షాపులు, కార్యాలయాలను ఆయన విక్రయించాడు. అయితే ఐదేళ్ల క్రితం వరకు బిల్డర్ అన్ని షాపులను, కార్యాలయాలను తన ఆధీనంలో పెట్టుకుని నిర్వహణను గాలికి వదిలేశాడు.
- ఐదేళ్ల క్రితం షాపుల యజమానులు కోర్టుకు వెళ్లి మెయింటెనెన్స్‌ను తామే చూసుకునేలా ఆర్డర్ తెచ్చుకున్నారు. బిల్డర్ పట్టించుకోకపోవడంతో గతంలో ఇదే భవనం వెనుక వైపు రెయిలింగ్ కూలిపోయి కార్లు, ద్విచక్ర వాహనాలు దెబ్బతిన్నాయి.



ప్రమాదం జరిగిన కార్యాలయంపై అనుమానాలు

స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో అగ్ని ప్రమాదం మొదలైన సంస్థ తీరుపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మీ సేవకు సంబంధించి పనిచేసే ఈ సంస్థలో గత కొద్ది రోజుల నుంచి కేవలం ఇద్దరు మాత్రమే పనిచేస్తున్నారు. సంస్థ యజమానితో పాటు మరొక ఉద్యోగి మాత్రమే ఉన్నారు. ప్రమాదం జరిగిన సమయానికి ముందే వారు వెళ్లిపోవడం, గతంలో కొన్ని అనైతిక కార్యకలాపాలు చేయడంతో వీరిపై కాంప్లెక్స్‌లోని మిగతా యజమానులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ప్రాణాలతో బయటపడ్డాం



మూడవ ఫ్లోర్‌లో అమిల్ లిమిటెడ్ సంస్థలో పనిచేస్తున్నా. ప్రతి రోజూ రాత్రి 8 గంటల వరకు కార్యాలయంలో ఉంటాం. గురువారం ఉదయం నుంచి మబ్బులు కమ్ముకుని ఉండడంతో ముందుగానే వెళ్లాం. ఇంటికి వెళ్లాక అగ్నిప్రమాదం జరిగిందని తెలిసి ఆందోళన చెందాం. ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. – శ్రీదివ్య

చాలా ప్రయత్నించాం



అగ్ని ప్రమాదం జరిగిందని తెలియగానే మంటలు ఆర్పేందుకు యత్నించాం. పై అంతస్తుల్లోకి వెళ్లేందుకు ప్రయత్నించినా లోపలికి వెళ్లలేకపోయాం. ఐదేళ్ల క్రితమే మెయింటెనెన్స్ ఆధీనంలోకి తీసుకున్నాం. హౌస్ కీపింగ్, సెక్యూరిటీ మాత్రమే చూస్తున్నాం. కోర్టులో కేసులు నడుస్తుండడంతో ఏమీ చేయలేకపోతున్నాం. గతంలో చిన్నచిన్న ప్రమాదాలు జరిగినా ఆరుగురు ప్రాణాలు కోల్పోవడం మొదటిసారి. ఇది చాలా బాధాకరం.

– శ్రీకాంత్‌రెడ్డి స్వప్నలోక్, సూర్యకిరణ్ ఎస్టాబ్లిష్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు

బాధితులను ఆదుకుంటాం

డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి



లాలాపేట: స్వప్నలోక్ కాంప్లెక్స్ అగ్నిప్రమాద బాధిత కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆమె అధికారులతో కలిసి శుక్రవారం ఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు. ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం దురదృష్టకరమని, ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు నిపుణులతో కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి కేటీఆర్, మేయర్ రాజీనామా చేయాలి: బీజేపీ కార్పొరేటర్లు



అగ్ని ప్రమాదం జరిగిన స్వప్నలోక్ కాంప్లెక్స్‌ను బీజేపీ కార్పొరేటర్లు ఆకుల శ్రీవాణి(సరూర్‌నగర్), మహేందర్(మూసాపేట్), శ్రావణ్(మల్కాజ్‌గిరి) సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సికింద్రాబాద్‌లో వరుస అగ్ని ప్రమాద ఘటనలు జరుగుతున్నాయని, ఈ ఘటనల్లో ఇప్పటి వరకు 28 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. దక్కన్ మాల్‌లో జరిగిన అగ్ని ప్రమాద సమయంలో దీనిపై ప్రత్యేక కమిటీ వేస్తామని చెప్పిన మంత్రులు, అధికారులు ఎక్కడకు వెళ్లారని ప్రశ్నించారు. ఈ ప్రమాదాలు ప్రభుత్వానికి సిగ్గు చేటని, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ముక్కు నేలకు రాసి బాధిత కుటుంబాలకు క్షమాపణ చెప్పి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వరుసగా జరుగుతున్న ఈ ఘటనలతో అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని, ఇవేమైనా ఉగ్ర చర్యలకు సంకేతాలా అని ప్రశ్నించారు. ప్రజల ప్రాణాలు కాపాడేందుకు పనిచేయకుండా లిక్కర్ స్కామ్‌లో చిక్కుకున్న కవితను రక్షించేందుకు అందరూ ప్రయత్నిస్తున్నారని బీజేపీ కార్పొరేటర్లు ఆరోపించారు.

రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి



కాంప్లెక్స్ వద్ద సీపీఐ నాయకులు

వరుసగా జరుగుతున్న అగ్ని ప్రమాద ఘటనల్లో అమాయకులు ప్రాణాలు కోల్పోతుంటే జీహెచ్‌ఎంసీ, ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉన్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈటీ నరసింహ విమర్శించారు. శుక్రవారం ఉదయం ఆ పార్టీ నాయకులతో కలిసి స్వప్నలోక్ కాంప్లెక్స్‌ను సందర్శించి కొద్దిసేపు ఆందోళన నిర్వహించారు. మృతుల కుటుంబాలకు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

సమాచారం

20న అప్రెంటీస్, ఉద్యోగ మేళా

సనత్‌నగర్: జెక్‌కాలనీలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) ఆధ్వర్యంలో ఈ నెల 20న ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటీస్ మేళా, ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఐటీఐ ప్రాంగణంలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 వరకు మేళా జరుగుతుందన్నారు. ఎస్సెస్సీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ ఉత్తీర్ణులైన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఆసక్తి ఉన్న వారు ఒరిజినల్ ధృవీకరణ పత్రాలతో పాటు ఒక జత జిరాక్స్ కాపీలు తీసుకురావాలని చెప్పారు. వివరాల కోసం 9908849165, 9502248617 నంబర్లలో సంప్రదించాలన్నారు.

'ప్రతి ఒక్కరూ కవిత్వం రాయొచ్చు'

ఉస్మానియా యూనివర్సిటీ: జీవితం నుంచే కవిత్వం పుడుతుందని ప్రముఖ కవి శివారెడ్డి అన్నారు. శుక్రవారం ఓయూ తెలుగు శాఖ ఆధ్వర్యంలో కవితా సింగిడి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శివారెడ్డి మాట్లాడుతూ.. కవిత్వం రాయడానికి వ్యాకరణం, నిఘంటువులు అవసరం లేదని, ప్రతి ఒక్కరూ కవిత్వం రాయవచ్చన్నారు. కార్యక్రమంలో సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ, ప్రొ.కమలాకర శర్మ, తెలుగు శాఖ హెడ్ ప్రొ.కాశీం, అంజయ్య, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నిక ఫలితాలు బీజేపీ విజయానికి నాంది

అడ్డగుట్ట: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి విజయం వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ గెలుపునకు నాంది అని ఓబీసీ మోర్చా ఎంబీసీ సెల్ రాష్ట్ర కో–కన్వీనర్ మల్లేశ్వరపు రాజేశ్వరి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రజలను గాలికి వదిలేసి లిక్కర్ స్కామ్‌లో కూరుకుపోయిన ఎమ్మెల్సీ కవితను కాపాడే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం మోసపూరిత హామీలతో ప్రజలను తొమ్మిదేళ్లుగా మోసం చేస్తూనే ఉందని, టీఎస్‌పీఎస్సీ పరీక్షల ప్రశ్నపత్రాలను లీక్ చేసి నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో విసిగిపోయిన ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమన్నారు.

'టీఎస్‌పీఎస్సీ చైర్మన్ రాజీనామా చేయాలి'

లాలాపేట: టీఎస్‌పీఎస్సీ ఇప్పటి వరకు నిర్వహించిన అన్ని పరీక్షలను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని దక్షిణ భారత రాజకీయ సమితి కన్వీనర్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రశ్నపత్రాల లీకేజీకి బాధ్యత వహిస్తూ టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి రాజీనామా చేయాలన్నారు. ఇప్పటి వరకు నిర్వహించిన పరీక్షలపై న్యాయ విచారణ చేయాలని, కోట్లాది మంది నిరుద్యోగుల భవిష్యత్‌ను నాశనం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల భవిష్యత్ కోసం పోరాటం చేస్తున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ దీక్షను అడ్డుకోవడం సరికాదన్నారు.

మసీదుల వద్ద సమస్యలను పరిష్కరిస్తాం



సనత్‌నగర్: రంజాన్ ఉపవాస దీక్షలు త్వరలో ప్రారంభం కానున్న దృష్ట్యా మసీదుల వద్ద డ్రైనేజీ, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి తెలిపారు. వాటర్ వర్క్స్ జీఎం రమణారెడ్డి, డీజీఎం శశాంక్‌తో కలిసి శుక్రవారం ఆమె డివిజన్ పరిధిలోని ప్రకాష్‌నగర్, వికార్‌నగర్ తదితర మసీదుల వద్ద వసతులను పరిశీలించారు. వికార్‌నగర్ బస్తీతో పాటు మసీదు వద్ద డ్రైనేజీ సమస్య ఉత్పన్నమవుతుందని, శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కార్పొరేటర్‌కు విజ్ఞప్తి చేశారు. రంజాన్ నెల ప్రారంభమయ్యే లోపు ఇక్కడి డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆమె సూచించారు.

ఆలయాల అభివృద్ధికి సహకారం అందిస్తా

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: దేవాలయాల అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్‌లోని సుభాష్‌నగర్‌లో రూ.35 లక్షల సొంత నిధులతో పునః నిర్మించిన ఈదమ్మ మైసమ్మ దేవాలయం ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో శుక్రవారం మంత్రి తలసాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ.. బల్కంపేట ఎల్లమ్మ, మహంకాళి ఆలయం, హనుమాన్ దేవాలయం వంటి ప్రధాన ఆలయాలు సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలో ఉండడం అదృష్టమన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఆలయాలు ఎంతో అభివృద్ధి చెందాయని చెప్పారు. బల్కంపేట ఎల్లమ్మ ఆలయం, మహంకాళి ఆలయాల వద్ద భక్తుల సౌకర్యార్థం చేపట్టిన అభివృద్ధి పనుల గురించి ఆయన ప్రస్తావించారు. నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి పైపులైన్, విద్యుత్‌లైన్ల ఏర్పాటు వంటి అనేక పనులను కోట్లాది రూపాయల వ్యయంతో చేపట్టినట్లు తెలిపారు. సుభాష్‌నగర్‌లో ఎన్నో సంవత్సరాల నుంచి ఉన్న హైటెన్షన్ విద్యుత్ లైన్ సమస్యను పరిష్కరించామని, ఈ విద్యుత్ లైన్ల కారణంగా అనేక మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని స్థానిక మహిళలు చేసిన విజ్ఞప్తి మేరకు ఉగాదిలోపు పునః నిర్మిస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చామని మంత్రి పేర్కొన్నారు. నియోజకవర్గం పరిధిలో ఇప్పటికే 18 ఆలయాలు, 11 ఆర్చిలను నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్‌యాదవ్, కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రామకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఆలయం ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి తలసాని

కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత

పేదింటి ఆడపడుచుల పెళ్లికి ఆర్థిక సాయం చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఆయన నివాసంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాల ఆడబిడ్డల వివాహానికి లక్ష 116 రూపాయల ఆర్థిక సహాయం అందజేస్తున్నారని చెప్పారు. అర్హులందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి పాల్గొన్నారు.

'డాక్టర్ బోధన్‌కర్ మృతి వైద్య రంగానికి తీరని లోటు'

రసూల్‌పురా: ప్రముఖ వైద్యుడు ఆక్యుపేషనల్ థెరపిస్ట్ డాక్టర్ బోధన్‌కర్ మృతి వైద్య రంగానికి తీరని లోటు అని స్వీకార్ ఉప్‌కార్ రిహాబిలిటేషన్ వ్యవస్థాపకుడు పద్మశ్రీ డాక్టర్ పి.హన్మంతరావు అన్నారు. శుక్రవారం స్వీకార్ ఉప్‌కార్ సంస్థలో బోధన్‌కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం హన్మంతరావు మాట్లాడుతూ.. ఉస్మానియా ఆస్పత్రిలో బోధన్‌కర్ మొదటి ఆక్యుపేషనల్ థెరపిస్ట్ అన్నారు. ఆక్యుపేషనల్ వైద్య అంశాలపై హైదరాబాద్‌లో మూడు జాతీయ సదస్సులు నిర్వహించారని, ఆక్యుపేషనల్ థెరపీ వృత్తికి ఆయన అందించిన సేవలకు గాను జీవిత కాల సాఫల్య పురస్కారం అందుకున్నారన్నారు.

రేర్ డిసీజెస్‌పై విస్తృత అవగాహన కల్పించాలి

సనత్‌నగర్: జన్యుపరమైన సమస్యలతో వచ్చే అరుదైన వ్యాధులపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీరప్ప పేర్కొన్నారు. రేర్ డిసీజెస్ డే సందర్భంగా శుక్రవారం ఇనిస్టిట్యూట్ ఆఫ్ జెనెటిక్స్ అండ్ హాస్పిటల్స్ ఫర్ జెనెటిక్ డిసీజెస్, క్యూర్ ఎస్ఎంఏ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెస్ ఆడిటోరియంలో నిర్వహించిన సదస్సుకు బీరప్ప ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జన్యుపరంగా వచ్చే అరుదైన వ్యాధులపై చాలామందికి అవగాహన లేకపోవడంతో ప్రారంభ దశలో వాటిని గుర్తించలేకపోతున్నారన్నారు. దీంతో వారికి సరైన వైద్యం అందించలేకపోతున్నట్లు తెలిపారు. వైద్య విద్యార్థులకు సైతం రేర్ డిసీజెస్ పట్ల అవగాహన కల్పించేందుకు ప్రత్యేక పాఠ్యాంశాలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్ విభాగాధిపతి డాక్టర్ అశ్విందలాల్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ఏడు వేలకు పైగా రేర్ డిసీజెస్ ఉన్నాయని, వాటిలో 80 శాతానికి పైగా జన్యుపరమైన సమస్యలతో వచ్చేవేనని చెప్పారు. 20 శాతం వ్యాధులకు మాత్రమే ప్రస్తుతం వైద్యం అందించగలుగుతున్నట్లు తెలిపారు. రేర్ డిసీజెస్ కలిగిన వారి కుటుంబాలకు ఈ వ్యాధుల పట్ల అవగాహన కల్పించి కౌన్సెలింగ్ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ వ్యాధులపై అధ్యయనం చేసేందుకు ప్రభుత్వాలు ఫార్మా కంపెనీలను ప్రోత్సహించాలని, ఇప్పటికీ చాలా రకాల మందులను విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తుందని ఆయన పేర్కొన్నారు. పబ్లిక్ హెల్త్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అమర్ సింగ్, నిలోఫర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ ఉషారాణి, నేషనల్ కమిషన్ మెంబర్ డాక్టర్ సంతోష్‌కుమార్, ప్రోగ్రామ్ కన్వీనర్ డాక్టర్ విజయలక్ష్మి, ఇనిస్టిట్యూట్ ఆఫ్ జెనెటిక్స్ డైరెక్టర్ డాక్టర్ రాధారమాదేవి తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న నిమ్స్ డైరెక్టర్ బీరప్ప

యువకుడిపై దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు

సనత్‌నగర్: యువకుడిపై అకారణంగా దాడి చేసి గాయపర్చిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసిన ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బాలంరాయికి చెందిన జోనాథన్ తనకు ఉద్యోగం వచ్చిందని, దావత్ చేసుకుందామంటూ ఈ నెల 15న సికింద్రాబాద్ ఆలుగడ్డబావికి చెందిన సన్నీ(22)తో పాటు మరో ఇద్దరు స్నేహితులు జోయల్, రాజేష్‌లను ఆహ్వానించాడు. వీరంతా జోయల్ ఇంట్లో మద్యం తాగారు. ఆ సమయంలో సన్నీ గట్టిగా మాట్లాడాడనే కారణంతో అతడిపై దాడి చేశారు. భయంతో సన్నీ బయటకు వెళ్లినప్పటికీ తిరిగి తీసుకువచ్చి మళ్లీ కొట్టారు. సన్నీ తలకు, ఒంటిపై గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు బేగంపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

సనత్‌నగర్: విద్యుదాఘాతంతో వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బోరబండకు చెందిన రాజేష్ (30) జ్యూస్ షాపు నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి విద్యుత్ సరఫరాలో ఒక్కసారిగా హై ఓల్టేజ్ వచ్చింది. ఈ సమయంలో జ్యూస్ తయారుచేస్తున్న రాజేష్ విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని సనత్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

నిద్రలోనే ప్రాణాలొదిలిన కార్మికుడు

సనత్‌నగర్: నిద్రలోనే ఓ కార్మికుడు మృతిచెందిన ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని బీర్భుమ్ జిల్లాకు చెందిన దీపక్ మండల్ (39) ఫైబర్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. హయత్‌నగర్‌లోని ఓ కంపెనీలో పనిచేస్తున్న దీపక్ మండల్ బేగంపేట రసూల్‌పురా ప్రాంతంలోని ఓ గదిలో తోటి కార్మికులతో కలిసి ఉంటున్నాడు. గురువారం సాయంత్రం విధులు ముగించుకుని వచ్చిన తరువాత భోజనం చేసి పడుకున్న దీపక్‌ను ఉదయం తోటి కార్మికులు నిద్ర లేపేందుకు ప్రయత్నించగా ఎంతకీ లేవలేదు. నిద్రలోనే దీపక్ మరణించినట్లు గుర్తించిన సహచరులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బార్‌కు వెళ్లిన వ్యక్తిపై బౌన్సర్ దాడి.. కేసు నమోదు

సనత్‌నగర్: బార్‌కు వెళ్లిన వ్యక్తిపై అక్కడి బౌన్సర్ దాడి చేసి గాయపరిచిన ఘటన ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ ప్రదీప్ తెలిపిన వివరాల మేరకు.. బాపునగర్‌కు చెందిన ఎన్.నగేష్ (40) ఈ నెల 15న రాత్రి ఎస్సార్‌నగర్‌లోని హంటర్ రెస్టో బార్‌కు వెళ్లాడు. మద్యం తాగిన అనంతరం బార్ యజమానిని కలిసేందుకు నగేష్ ప్రయత్నించగా అక్కడ ఉన్న ముగ్గురు బౌన్సర్లు అతడిని అడ్డుకున్నారు. ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించడంతో నితేష్ అనే బౌన్సర్ తన చేతి కడియంతో నగేష్‌పై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మారణాయుధాలతో సంచరిస్తున్న ముగ్గురికి జైలు

చిలకలగూడ: మారణాయుధాలతో సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న ముగ్గురికి జైలు శిక్ష విధించిన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. డీఐ నాగేశ్వరరావు, డీఎస్ఐ సాయికృష్ణ తెలిపిన వివరాల మేరకు.. పార్శిగుట్టకు చెందిన సూర్య అనీల్ (23), రవికుమార్ (23), అంబర్‌నగర్‌కు చెందిన సయ్యద్ తబ్రేజ్ (24) గురువారం రాత్రి మారణాయుధాలతో వేర్వేరుగా తిరుగుతున్నారు. గస్తీ పోలీసులు తనిఖీలు నిర్వహించగా వారి వద్ద కత్తి, ఇనుప రాడ్ వంటివి కనిపించాయి. ఈ పెట్టీ కేసు నమోదు చేసి శుక్రవారం సికింద్రాబాద్ స్పెషల్ ఎంఎం కోర్టులో హాజరుపర్చగా సూర్య అనీల్, సూర్యకుమార్‌లకు రెండు నెలల చొప్పున, సయ్యద్ తబ్రేజ్‌కు ఐదు రోజులు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి పాండురంగ విఠల్ తీర్పు చెప్పారు.

వ్యక్తి ఆత్మహత్య

సనత్‌నగర్: వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ముత్తుయాదవ్ తెలిపిన వివరాల మేరకు.. సనత్‌నగర్ ఎస్సార్టీ కాలనీలో నివసించే శ్రీనివాస్(36) సినీ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. రెండు సంవత్సరాలుగా గుంటూరుకు చెందిన మరియమ్మతో సహజీవనం చేస్తున్నాడు. ఆమె కొంతకాలంగా వేరే వ్యక్తితో సన్నిహితంగా ఉంటుండడంతో శ్రీనివాస్ నిలదీశాడు. దీంతో ఇరువురి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ఉరేసుకుని శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీనివాస్‌కు గతంలో వివాహం జరగ్గా భార్య ఉద్యోగ నిమిత్తం కువైట్‌లో ఉంటుంది.

శిశువు మృతికి వైద్యులే కారణమంటూ..

- ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన

సనత్‌నగర్: ప్రసవం సమయంలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా శిశువు మృతి చెందిందంటూ తల్లిదండ్రులు, బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. బోరబండ శ్రీరామ్‌నగర్‌కు చెందిన షేక్ అఫ్రోజ్ భార్య ఫసియా(23)కు పురిటి నొప్పులు రావడంతో శుక్రవారం మోతీనగర్ సమీపంలోని పాండురంగానగర్‌లో గల నీలిమ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆమె మగ శిశువుకు జన్మనిచ్చింది. అయితే శిశువు మృతిచెందడంతో ఆమె కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. శిశువు ఒంటిపై గాయాలు ఉన్నాయని, ప్రసవ సమయంలో కిందపడి మృతిచెందినట్లు వారు ఆరోపించారు. ఆస్పత్రి ఎండీ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. గర్భిణిగా ఉన్న ఫసియా స్రమిన్ తమ ఆస్పత్రిలోనే చికిత్స తీసుకుంటూ వచ్చిందని, పురిటి నొప్పులతో ఆస్పత్రికి వచ్చిన ఆమెకు వైద్యులు సిజేరియన్ చేసినట్లు తెలిపారు.

వైద్యుల నిర్లక్ష్యం లేదు..

శిశువు మృతిచెందడంలో తమ నిర్లక్ష్యం ఏ మాత్రం లేదని, పోస్టుమార్టం చేస్తే నిజాలు తెలుస్తాయన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ముత్తుయాదవ్ తెలిపారు.

జాతీయ పట్టు వస్త్ర ప్రదర్శన ప్రారంభం



వస్త్ర ప్రదర్శనను ప్రారంభిస్తున్న నవ్య

సాక్షి, సిటీ బ్యూరో: అనాది నుంచి మన సంస్కృతిలో భాగంగా సిల్క్, హ్యాండ్లూమ్ వస్త్ర ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందని, నేటికీ వాటిపై వన్నె తగ్గలేదని బ్యాడ్మింటన్ క్రీడాకారిణి ఎం.నవ్యారావు అన్నారు. గ్రామీణ హస్తకళా వికాస్ సమితి నేతృత్వంలో సికింద్రాబాద్‌లోని రాజరాజేశ్వరి గార్డెన్ వేదికగా ఏర్పాటు చేసిన జాతీయ పట్టు వస్త్ర ప్రదర్శన–2023ను నవ్యారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత మోడ్రన్ కాలంలోనూ యువత హ్యాండ్లూమ్ ఉత్పత్తులను విశేషంగా ఆదరిస్తున్నారన్నారు. డిజైనర్లు సైతం దేశంలో చేనేతలు నేస్తున్న ఈ హ్యాండ్లూమ్ ఉత్పత్తులకు వారి సృజనాత్మకతతో మరింత అందాన్ని, గుర్తింపును తీసుకువస్తున్నారని చెప్పారు. ఈ నెల 20 వరకు కొనసాగనున్న ప్రదర్శనలో దేశ వ్యాప్తంగా 14 నగరాల నుంచి చేనేత కళాకారులు, చేతి పని బృందాలు తమ సిల్క్ హ్యాండ్లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 50 వేల రకాల వస్త్ర ఉత్పత్తులను ప్రదర్శిస్తారని నిర్వాహకుడు జి.గుప్తా వివరించారు.